పానకంలో పీచు

దత్తాత్రేయులు అయిదో ఏట, తనతల్లి పురుడు పోసుకోవటానికి మేనమామల ఇంటికి వచ్చినప్పుడు మొట్టమొదటిసారి బస్తీ మొగం చూశాడు. తను కూడా ఆ ఇంట పుట్టినవాడే. మూడేళ్ళు నిండకపూర్వం ఇంకోసారి ఇక్కడికి తల్లివెంట వచ్చాడు. తాతకు కిందటూ మీదటూ అవుతున్న రోజుల్లో. అయితే ఆ రాకగురించి దత్తాత్రేయులుకేమీ జ్ఞాపకంలేదు - తాత శవాన్ని స్నానం చేయించి ఫోటో తీయడం తప్ప. ఆ ఫోటో కాపీ తన పల్లెటూరి ఇంటిసావడిలో రోజూ చూడకపోతే అతనికి ఈ విషయం కూడా జ్ఞాపకం ఉండదేమో.

తమ్ముడి పుటకలకు బస్తీ వచ్చినప్పుడు మాత్రం దత్తాత్రేయులు బస్తీ తరహాలన్నీ బాగా చూశాడు. మట్టిరోడ్ల గతుకుల్లోనూ, కాలుదిగబడే బురదలోనూ రోజూ నడిచే దత్తాత్రేయులకు కంకర రోడ్లు అద్దాలల్లే కనిపించాయి. అతడు మూడంతస్తుల మేడ ఎక్కాడు. రాత్రిపూట వీథుల్లో లాంతరు స్తంభాలు చూశాడు. పెద్ద బజారులో దుకాణాలు చూశాడు. వాటిల్లో ఆకర్షవంతంగా పెట్టి ఉన్న రకరకాల వస్తువులు చూశాడు. రాత్రివేళ ఈ దుకాణాలలోనే వెలిగే "లస్టరు" దీపాలు చూశాడు. పెద్ద చప్పుడు చేసుకుంటూ బజారులో పొయ్యే మోటారు కారుకూడా ఒకటి చూశాడు. మేనమామల ఇంటికి రైలుదారి అరమైలు దూరంలో ఉంది. కొత్తగా ఏర్పడిన బస్తీ స్నేహితుడి వెంట రైలు కట్టనపోయి రైళ్ళు రావటమూ పోవటమూ కూడా చూశాడు. అదృష్టవశాత్తూ ఆరోజుల్లోనే తారాబాయి జుట్టుతో ఇంత పెద్ద బండ పైకెత్తటమూ, బండిమీద పదిమందిని ఎక్కించి బండిపోలు నుదుటికి ఆనించి బండిని తోయటమూ, కత్తులమీద పడుకోవటమూ, ఆడపిల్ల అందమైన గౌను తొడుక్కొని అంతకన్న అందమైన గొడుగు చేత్తో పట్టుకుని తీగమీద వెనక్కూ, ముందుకూ నడవటమూ చూశాడు.

ఇటువంటి జీవితాన్ని ప్రేమించటం ఎంత సులభం! తన బస్తీ స్నేహితుడి ముందు తాను తీసికట్టుగా ఉన్నట్టు దత్తాత్రేయులు అనుక్షణమూ భావించేవాడు. తనకన్న ఉన్నత స్థాయిలో ఉన్నవాడి ఔన్నత్యం గుర్తించలేని అశక్తత సహజమైనది కాదు. అహంకారం

కష్టపడి సాధించాలి. తన పల్లెటూళ్ళో ఎందరో ఆడపిల్లలున్నారు. కాని ఈ బస్తీ స్నేహితుడి చెల్లెలు - ఆ పిల్లకూ ఇతని ఈడే ఉంటుంది - ఇతని కళ్ళకు అపూర్వంగా కనపడింది.

"నేను చచ్చినా పల్లెటూళ్ళో ఉండను - పెద్దవాణ్నయితే!" అనుకున్నాడు దత్తాత్రేయులు.

తన పల్లెటూళ్ళో ఎవరూ చదువుని గురించి అంత ఆసక్తిగా మాట్లాడగా దత్తాత్రేయులు వినలేదు. కాని తనబస్తీ స్నేహితుడు చదువు గురించి చెప్పరానంత ఆసక్తిగా మాట్టాడేవాడు. ఆ అబ్బాయి తాను బియ్యే ఎన్నో ఏట పేసవుతాడో, తరువాత ఎంత జీతం గల ఉద్యోగం చేస్తాడో వర్ణిస్తుంటే దత్తాత్రేయులకు నోరూరినంత పనయింది.

దత్తాత్రేయులు అటువాళ్ళూ, ఇటువాళ్ళూ కూడా ధనికులనిగాని దరిద్రులనిగాని చెప్పటానికి లేదు. వాళ్ళకి పెద్ద కోరికలూ లేవు. పెద్ద రాబడీ లేదు. అవసరాలూ, కోరికలూ తీర్చుకునే రాబడికలవాడే రాజాధిరాజు. అందుచేత వారూ వీరూ కూడా రాజాధిరాజులే. కాకపోతే దత్తాత్రేయులు తండ్రి పల్లెపట్టున ఉండి తనకున్న కొద్దిపాటి పొలాలూ, దొడ్లూ చూచుకునేవాడు. దత్తాత్రేయులు మేనమామలు ఉద్యోగాలు చేసుకొనే వాళ్ళు.

2

దత్తాత్రేయులుకు చదువు చెప్పించరాదని తండ్రి ఎన్నడూ అనుకోలేదు. అయితే అయిదో ఏటనే వాడు చదువుకోసం తాపత్రయ పడతాడని ఆయన అనుకోలేదు. చదువంటే ఆయన ఉద్దేశం దొక్కశుద్ధి అని. రాయటమూ, చదవటమూ, లెక్కలు చేయటమూ చాతనయితే దత్తాత్రేయులు జీవితానికి లోటుండదని ఆయన విశ్వాసం. ఆ చదువు ఎప్పుడారంభించినా మూడు నాలుగేళ్ళలో పూర్తి అవుతుంది. అంతకన్న ఎక్కువ చదివితే కోరికలు బలుస్తాయని ఆయనకు భయం.

"నేను బియ్యే ప్యాసవుతాను" అన్నాడు దత్తాత్రేయులు ధైర్యం చేసి.

"నీ మొహమేం కాదూ? బియ్యే ప్యాసయి ఏం చేస్తావు? ఉద్యోగం చేసి, డబ్బు సంపాదించి, మీ మేనమామలల్లే అంగళ్ళకు పోస్తావా? వాళ్ళ సంపాదనే ఈ వూళ్ళో వుంటేనా?" అన్నాడు తండ్రి.

"ఈ ఊళ్ళో ఉంటే సంపాదన ఎట్లా వస్తుందీ?" అన్నది దత్తాత్రేయులు తల్లి.

"అదీ నిజమే అనుకో. అందుకని మనవాడు ఉద్యోగాల కోసమని ఉన్నచోటు వొదులుకొని ఊళ్ళవెంట పోవాలంటావా? బాగుంది."

"మనం వద్దంటే తప్పుతుందా ఏమిటి? ఇంక నలుగురు పుట్టుకొచ్చి ఈ కాస్తా

పంచుకుంటే ఏం తింటారు? వాళ్ళ పిల్లలకేం పెట్టుకుంటారు? ఆ మాత్రం ఆలోచన లేదేం మీకు?"

పెళ్ళాం చెప్పేది ఆయనకు నిజంగానే కనపడినా కూడా నచ్చలేదు. తన అన్నగారు పల్లెటూరిపిల్లను చేసుకున్నాడేమో, ఆవిడ ఇట్లా మాట్లాడదు. బస్తీదాన్ని చేసుకోవటం పెద్ద పొరపాటయిందనుకున్నాడు దత్తుతండ్రి.

"సరే అంతగా కొడుక్కు చదువు కావాలంటున్నావు కనక నీ అన్నల్ని దగ్గర ఉంచుకు చదువు చెప్పించమను" అన్నాడు దత్తుతండ్రి, పెళ్ళాన్ని శిక్షిస్తున్నవాడల్లే.

"మావాళ్ళు ఈ మాత్రానికి వెరవరులెండి" అన్నది దత్తు తల్లి.

చివరకు ఆ ఏర్పాటే జరిగింది. చదువుకోసం అంత చిన్న వయస్సులోనే మేనమామల ఊరు వచ్చేశాడు. కాని దత్తుకు బస్తీ వచ్చిన ఆనందం కలుగలేదు. ఇక్కడికి వచ్చినప్పటినుంచీ తల్లీ, తండ్రి, కాళ్ళూ చేతులు సాగదీసుకుంటూ ఆడుకునే పసితమ్ముడూ, ఇల్లూ గొడ్లు, పొలాలు జ్ఞాపకం రాసాగాయి.

దీనికితోడు తన మేనమామల ఇంట్లో జీవితం మొదట కనిపించినంత ఆనందమయంగాలేదు. తల్లి పురుటి హడావుడిలో అందరూ ఒకటైనారు. గాని వీళ్ళలో వీళ్ళకు కలతలున్నాయి. తన ఇద్దరు మేనమామల భార్యలూ అవకాశం దొరికినప్పుడల్లా కీచులాడుకుంటూ ఉంటారు. మళ్ళీ కలుస్తూ ఉంటారు. వీళ్ళ మూలంగా మధ్య మధ్య వీళ్ళ మొగుళ్ళు కూడా తగూలాడుకోవలసి వస్తుంది.

ఈ పోట్లాటలో ఉండే స్వార్థం దత్తుకు అర్థమవుతూనే ఉండేది. కాని స్వార్థం మనుషులలో ఉండే చెడ్డతనం వల్లనే కలుగుతుందని ఆ వయసులో దత్తు నమ్మేవాడు.

అతనింకా ఇతర విషయాలుకూడా మేనమామల ఇంట్లో గమనించాడు. తన పల్లెటూళ్ళో ఎరుగనివి – ఇక్కడ వీళ్ళు పొరుగింటివాళ్ళకు చిన్న కరేపాకు రెబ్బలు అయినా ఇవ్వరు. అన్నీ డబ్బుపోసి కొంటారుగాదూ, అందుకని ఎవరికీ ఏమీ పెట్టరు. ఇస్తే ఇచ్చినందుకు గంటసేపు సణుగుతారు. అడిగినవాళ్ళను గురించి అసహ్యంగా మాట్లాడుకుంటారు. ఆఖరికి ఇన్ని మజ్జిగ ఇవ్వటం కూడా వీళ్ళకు ప్రాణాంతకమే. ఇంటికి చుట్టాలు వచ్చిపోతే వాళ్ళను గురించి, పరాయివాళ్ళను గురించి మాట్లాడినట్టు మాట్లాడతారు. ఊళ్లో ఉన్న చుట్టాలనే నెలకొకసారి కూడా చూడరు!

3

చాలా ఏళ్ళు గడిచాయి. దత్తాత్రేయులు హైస్కూలు చదువు పూర్తిచేశాడు. ఇప్పుడతనికి బస్తీ జీవితం గురించి తెలియని విషయాలు లేవు. పల్లెటూరి జీవితం గురించే

అతనికి ఏమీ తెలియదు. ఎప్పుడన్నా వాళ్ళ వూరు పోతే విశ్రాంతి కోసం వెళ్ళినట్టు భావించేవాడు. రెండురోజులు గడిపేటప్పటికి ప్రాణం మీదికి వచ్చినట్టు ఉండేది. తమ్ముణ్ణి చూస్తే అతనికి ఆశ్చర్యమయ్యేది. గొడ్లు కాసుకునేవాళ్ళకీ, రంగడికీ తేడా లేదు. వాణ్ణి కూడా చదివించాలని చూశారుగాని వాడికి చదువు అంటనేలేదు. వాడికి పొలాలమీద తిరగటమూ, గొడ్లను చూడటమూ, అలగాజనంతో చేరి పోచికోలు కబుర్లు చెప్పటమూ సరదా.

స్కూలు ఫైనలు పరీక్షలో దత్తుకు వచ్చిన మార్కులు చూసి వాళ్ళ హెడ్మాస్టరు వాణ్ని కాలేజీ చదువుకు పట్నం పొమ్మన్నాడు. దత్తు కనబరుస్తున్న ఉత్సాహం చెడగొట్టటం యిష్టంలేక, తనకు శక్తి లేకపోయినా, తండ్రి పట్నం చదువుకు సమ్మతించాడు.

"అంతగా అయితే అప్పుచేస్తాను. తరవాత వాడు పెద్ద ఉద్యోగం చేస్తే ఈ భాగ్యం తిరిగి సంపాదించలేకపోతాడా ఏమిటి?" అనుకున్నాడు దత్తుతండ్రి!

దత్తుకు ప్రెసిడెన్సీ కాలేజీలో సీటు దొరికింది. మద్రాసులో అడుగుపెడుతూనే దత్తు "అసలు నేనుండవలసింది మద్రాసులో" అనుకున్నాడు. ఈ తారురోడ్లూ, ఈ ట్రాములూ, బస్సులూ, ఈ విద్యుద్దీపాలూ, ఈ మహాభవనాలూ, ఈ పార్కులూ, రేడియో వాళ్ళు కట్టే ఖరీదైన చీరెలు, పెట్టే రవ్వలూ, బీచీ, అక్కడ చేరే విద్యార్థులూ – ఇదే నిజమైన భూలోక స్వర్గమనుకున్నాడు దత్తు.

దత్తు సహాధ్యాయులలో మోటారుసైకిళ్లు కలవారూ, కార్లమీద వచ్చేవాళ్ళూ కూడా ఉన్నారు. వాళ్ళ జీవితమూ, ఇళ్ళూ, వాకిళ్ళూ, సంసారమూ, వాళ్ళ తండ్రులూ తదితర బంధువులూ చేసే పెద్ద పెద్ద ఉద్యోగాలూ, వ్యాపారాలూ చూసి అతను మురిసిపోయాడు. ఒక విద్యార్థి తండ్రి పేరుమోసిన ఎడ్వకేటు. ఏడాదికో లక్ష కళ్ళజూస్తాడు. మరో విద్యార్థి తాత హైకోర్టు జడ్జిచేసి ఇటీవలనే రిటైరైనాడు. ఇంకో విద్యార్థి తండ్రికి పట్నంలో నాలుగైదు పెద్ద భవంతులున్నాయి. ఆయన వ్యాపారస్తుడు.

వ్యాపారం మాట ఎట్లా ఉన్నా గొప్ప ఉద్యోగాలు సంపాదించే అవకాశం తనకు కూడా ఉన్నందుకు దత్తు సంతోషించాడు. పట్నం జీవితం తనకు అంటరానిదని అతనికి తోచలేదు.

అయితే ఈ విషయంలో అతనికి కొంత అనుమానం కలగటానికి తోడ్పడ్డాడు గణపతి అనే కుర్రవాడు. గణపతి మలయాళీ కుర్రవాడు. అతనికి స్కూలు ఫైనలు పరీక్షలో అంతులేని మార్కులు వచ్చాయట. గొప్ప వక్త. డిబేటింగులో నిధి. ఇలొక్యూషను బహుమానాలు రెండు మూడు కొట్టేశాడు. చాలామంది కుర్రాళ్ళు గణపతి స్నేహం

అభిలషించేవాళ్ళు. అతనికి గర్వం ఏమీలేదు. అందరితోనూ మాట్లాడేవాడు. కాని అయిదు నిమిషాలు అతనితో మాట్లాడితే ఇవతలివాడికే ఏదో జంకు కలిగేది. అంత తెలివిగలవాడితో సరిసమానంగా స్నేహం చేయటం ఎట్లా?

గణపతి ఎన్నివేల పుస్తకాలు చదివి ఉంటాడోనని దత్తు ఆశ్చర్యపడ్డాడు. కాలేజీ తెరిచిన కొద్ది రోజులకే గణపతి రెండేళ్ల పొడుగూతా చదవవలసిన పుస్తకాలన్నీ ఒక విడత చదివిపారేశాడు. వాటిలో విషయాలను గురించి అతను మాట్లాడుతుంటే లెక్చరర్లు మాత్రం ఇంతకన్న ఏం చెప్పగలరనిపించేది దత్తుకు.

ఈ గణపతి ఒక గొడ్లసావిడిలాటి కొంపలో అతి బీదగా నివసిస్తున్నాడు. అతని గది చూసి దత్తు నిర్ఘాంతపోయాడు.

"నే నెవర్నని నీ ఉద్దేశం? మా నాన్న పొలం దున్నుకుంటాడు. మా అమ్మ పిడకలు చేస్తుంది. మాకున్నదల్లా ఒక పూరిగుడిసె. నాకు ఆరుగురు అక్కచెల్లెళ్ళూ, నలుగురు అన్నదమ్ములూ ఉన్నారు. నేను స్టేటు స్కాలర్‌షిప్పుతో చదువుకుంటున్నాను" అన్నాడు గణపతి.

"అయితే ఏం? నువు పెద్ద ఉద్యోగం చేసి చాలా డబ్బు సంపాదిస్తావు. మంచి ఇల్లు కట్టుకొని దర్జాగా బతకవచ్చు" అన్నాడు దత్తు. తన కోరికలన్నీ తనకు సాధ్యమైతే గణపతికెందుకు సాధ్యంకావనే ఉద్దేశంతో.

"మా సంస్థానంలో తప్ప నాకు ఉద్యోగాలిచ్చే వాళ్ళెవరూ లేరు. నా సంపాదనకు నా తమ్ముళ్ళకూ చెల్లెళ్ళకూ చదువు చెప్పించగలిగితే ప్రయోజకుణ్నే."

"తెలివిగలవాడివి కదా, నీకు ఉద్యోగం ఎవరిస్తారంటావేం?"

"తెలివితేటలకూ, ఉద్యోగానికీ సంబంధమేమిటి? పలుకుబడిని బట్టి ఉద్యోగాలు దొరుకుతాయి."

"పోనీ ఏ లాయరో అయితే?"

"దానికయినా వెనక అభిమానించే వాళ్ళుంటేనే తెలివితేటలు రాణించేది."

గణపతికన్న కార్లలో వచ్చే విద్యార్థులే ఎక్కువనుకోవటం దత్తుకు చాతకాలేదు. పెద్ద ఉద్యోగమూ, చాలా డబ్బూ సంపాదించే అవకాశాలు గణపతికే లేకపోతే తనకేమున్నాయనుకోవాలి?

"ఈ ప్రపంచం డబ్బూ, పలుకుబడీ కలవాళ్ళది" అన్నాడు గణపతి. తాను ఎరిగిన తెలివిగలవాళ్ళు కొందరు చేస్తున్న ఉద్యోగాలను గురించి గణపతి చెప్పాడు. ఆ కథలు వింటే దత్తుకు నిస్త్రాణం వచ్చింది.

4

దత్తు బియ్యే పాసయినాడు, లా చదివాడు. లా చదువుకు తండ్రి అభ్యంతరం చెప్పాడు. ఇప్పటికే దత్తు చదువు చాలా భారమయిందన్నాడు. సగం పొలం తాకట్టు పెట్టి డబ్బు తీసుకురావటమయింది.

మరికొంతకాలం – రంగడివంతు మినహాయించగా మిగిలినది కూడా తాకట్టు పెట్టించి లా చదువు పూర్తిచేశాడు. బియ్యే చదువు పూర్తి కాగానే అతని వివాహమైంది. వాళ్లు కట్నం కింద ఇచ్చిన సొమ్ముతో దత్తు భార్యకు నగలు చేయించారు.

ఆ సొమ్ము మిగిల్చినా దత్తు చదువు తేలిక అయేది. మామగార్ని అప్పు అడుగుదామంటే వాళ్లూ అంతంతమాత్రంగాళ్ళే.

దత్తు చదువు పూర్తికాగానే కాటకం వచ్చింది. అప్పులవాళ్ళు తాకట్టు పెట్టుకున్న ఆస్తంతా రాయించుకుని కూడా తమ అసలు వాయిదాలు ముట్టలేదని వలవల్లాడారు. దత్తు కుటుంబమూ, అత్తవారి కుటుంబమూ కూడా ఒక్క దెబ్బన చితికి పోయాయి. దత్తు పట్టా పుచ్చుకోవటానికి కూడా కానీ లభించలేదు. పట్టా పుచ్చుకొని మాత్రం ప్రయోజనమేమిటి? కొత్త ప్లీడర్లకు కాఫీ ఖర్చులు గిట్టటంలేదు. గుమాస్తాల జీతాలు మొదలే గిట్టటంలేదు. చాలామంది లా జర్నల్సు కూడా తెప్పించటం లేదు.

ఈ సమయంలోనే భార్య కాపరానికి కూడా వచ్చింది.

తనూ తన భార్యా రంగడి ఆస్తిమీదపడి తినటం తప్ప మరొకమార్గం లేకపోవటం దత్తుకు విస్మయం కలిగించింది.

"ఈ మారుమూల పల్లెటూళ్ళో కూచుంటే సంపాదన ఎట్లావస్తుందీ? పట్నం పోతాను" అన్నాడు దత్తు.

"రోజులు బాగుపడేదాకా ఆగు. ఉన్నదే నలుగురమూ తిందాం" అన్నాడు రంగడు.

కాని దత్తుకు కాలు నిలువలేదు. పెళ్ళాం మెళ్ళోది తాకట్టు పెట్టి పట్నం చేరాడు. కాని ఇప్పుడు పట్నమంతా అపరిచితంగా ఉంది. ఈ మహాపట్నంలో చదువెక్కడ దొరుకుతుందో దత్తుకు తెలుసు. కాని 30 రూపాయల నౌఖరీ ఎక్కడ దొరికేదీ తెలియలేదు. తన పాత కాలేజీలకు వెళ్ళాడు. అవి అతనికేసి గుర్తించనట్లు చూశాయి. రెండు మూడు రోజులు తిరగగా ఎరిగినవాళ్ళు కొందరు కనిపించారు. అతని స్థితి చూసి జాలిపడ్డారు. కాని తరుణోపాయం చెప్పలేకపోయినారు. ఒకప్పుడు కార్లలో తిరిగేవాళ్ళను చూసి అసూయపడ్డ దత్తు, ఇప్పుడు ట్రాములలో తలపాగాలూ, కోటు ధరించి తిరిగేవాళ్ళను

చూసి అసూయపడ్డాడు. ఆఖరుకు బాంకుల దగ్గిర డవాలీ బంట్రోతులు కూడా తనకన్న అదృష్టజాతకులల్లే, క్రమజీవితం గడుపుతున్న వాళ్ళల్లే కనిపించారు.

దత్తు కుంగిపోయిన మనస్సుతో ఇంటికి తిరిగి వచ్చాడు. అతనికోసం ఒక ఉత్తరం ఎదురు చూస్తున్నది. ఆ ఉత్తరం ఎవరురాసిందీ కూడా కొంతసేపు దత్తుకు తెలియలేదు. అది రాసినవాడు నాలుగేళ్ళక్రితం అతనితో కలిసి బియ్యే చదివిన ఒక అరవ కుర్రవాడు. దత్తు చిరునామా చాలామంది తీసుకున్నారు. కాని అరవవాడు ఇన్నేళ్ళూ దాన్ని భద్రంగా దాచాడన్నమాట!

"నువీపాటికి ప్లీడరీలో ప్రవేశించి ఉంటావనుకుంటాను. నేను బొంబాయిలో ఒక ఎడ్వర్టయిజుమెంటు కంపెనీలో చేరి ప్రొడక్షను అసిస్టెంటుగా ఉన్నాను. నీ క్షేమ సమాచారాలు రాయి."

ఈ ఉత్తరానికి దత్తు వెంటనే సమాధానం రాస్తూ "నేను బొంబాయివస్తే ఏమన్నా ఉద్యోగం దొరుకుతుందా?" అని అడిగాడు.

దానికి అరవ స్నేహితుడు "చాలా ఉద్యోగాలు ఖాళీ వస్తుంటాయి. నువ్వు వస్తే ఏదో ఒకటి దొరక్కపోదు" అని రాశాడు.

దత్తు బొంబాయికి ప్రయాణమైనాడు.

బొంబాయి చూడగానే దత్తు కడుపులోనుంచి అనిర్వచనీయమైన ఆవేదన, అతి అందగత్తెను చూస్తే కలిగినట్టుగా, బయలుదేరింది. ఇటీవల అతని హృదయంలో జీవితంమీద ప్రేమ దాదాపు పూర్తిగా ఇంకిపోయింది. దానికి కారణం, సగం తనకు అవాంతరాలు తగలటం, సగం తాను గౌరవించేవాళ్ళు చాలామంది సరిగా తిండి అయినా లేకుండా అధోగతిలో ఉండటమూనూ. అయితే బొంబాయిలో అడుగు పెట్టగానే జీవితంమీద ఆశ మళ్ళీ దత్తు హృదయంలో చిగిర్చింది. ఈ మహాపట్టణంలో కూలిచేసుకు బతికేవాళ్ళు కూడా మహా అదృష్టవంతులనిపించింది. ఈ బొంబాయి ముందు మద్రాసు, దివిటీ ముందు దీపం. ఈ జీవితంలో నచ్చులేదు. ఎంతో వడివుంది. వాళ్ళనూ వీళ్ళనూ విమర్శించటానికీ, తోచక తిరగటానికీ ఎవరికీ తీరికలేదు.

దత్తుకు త్వరలోనే ఉద్యోగం దొరికింది. నెలకు 60 రూపాయల జీతం. అతని అరవ స్నేహితుడు అతనికి బొంబాయి యావత్తూ చూపటమేకాక అరడజను ఖాళీలు చూపించాడు. దత్తు చేసేపనికీ అతని చదువుకూ సంబంధంలేదు. ఇది గుమాస్తాగిరీ, అయితేనేం? 25 రూపాయలకూ మూడుగదుల భాగం, కొళాయీ, స్నానాలగదీ, ఎలక్ట్రిక్ దీపాలూ, వంటకుగానూ సహా దొరికింది. తనూ భార్యా హాయిగా ఉండవచ్చు. "ఈ

ఇంట్లో ఉంటున్నాను" అని నాలుగంతస్తుల భవంతి తన వాళ్ళకి చూపిస్తే వాళ్ళెంత గర్విస్తారు?

అయిదారు నెలలు గడిచాయి. ఈ అయిదారునెలలూ తనూ భార్యా స్వర్గంలో ఉన్నట్టు భావించాడు దత్తు. తన మొదటి ఉద్యోగం వదిలేసి 80 రూపాయలకు ఇంకో వుద్యోగం సంపాదించాడు.

అయినా దత్తును అసంతృప్తి వేధించసాగింది. అతను జీవితంలో కానీ మిగల్చటం లేదుసరిగదా, బొంబాయిలో నాగరికంగా బ్రతికి, జీవించి ఆనందించాలంటే 80 ఒక జీతం కాదు. అన్ని విధాలా తనతో సమానులనిపించుకునే వాళ్ళూ, తనకన్న తక్కువ వాళ్ళూ కూడా నెలకు అనేకవందలు సంపాదిస్తున్నారు. ఈ జీతం మీద రోజులు వెళ్ళుతున్నాయేగాని తనజీతం రెండు వేలకు బీమా చేసుకోవాలన్నా, నెలకో 10, 15 రూపాయలు వెనక వెయ్యదలచినా, భార్యకొక మంచి చీరెగాని కొనదలచినా ఇదోరాబడికాదు.

రంగడి పెళ్ళి అయింది. దత్తూ, భార్యా వెళ్ళలేకపోయినారు. డబ్బు లేదు.

ఇంకో సంవత్సరం తిరిగివచ్చింది. దత్తు భార్య గర్భంతో వుంది. ఆమెను పుట్టింట దిగవిడవడానికి పోవాలంటే అప్పు చేయవలసి వచ్చింది. దత్తు అత్తవారింటి నుంచి స్వగ్రామం వెళ్ళాడు. అక్కడి జీవితం చూస్తే దత్తుకు కడుపు తరుక్కుపోయింది. తండ్రికి కుడికాలు స్వాధీనం తప్పింది. తల్లికి విడిచి విడిచి చలిజ్వరం. చిక్కి శల్యమయింది. మందూ మాకూ లేదు. 60 ఏళ్ళన్నా తిరక్కముందే వాళ్ళిద్దరూ మృత్యువు నెదురుచూస్తూ వైరాగ్యంతో ఉన్నారు. రంగడి భార్య, పధ్నాలుగేళ్ళది, కాపరానికి వచ్చి, ఇంట్లో అందరికీ తన భర్తకు కూడా, గర్భశత్రువల్లే ప్రవర్తిస్తున్నది. ఆవిడది సత్యాగ్రహం టెక్నిక్కు. జీవితంలోని రొస్టు మనుష్యుల మనస్తత్వాలలో చక్కగా ప్రతిబింబిస్తున్నది. మనుష్యుల మనస్సులు తుడిచిన అద్దాలల్లే మటుకులేవు.

"నీ దగ్గర అయిదో, పదో వుంటే ఇయ్యి, అన్నయ్యా" అన్నాడు రంగడు.

దత్తు దగ్గిరలేదు. అతను అప్పు తెచ్చిన డబ్బు ఖర్చులకు చాలలేదు. బొంబాయిలో బయలుదేరేటప్పుడు ఆఖరుక్షణాన దత్తు భార్య తన తల్లికొక చీరా, తన వదినెగారి కొకచీరా కొనిపించింది. అయిదూ పది తక్కువైతే రంగణ్నడిగి తీసుకుందాం లెమ్మనుకున్నాడు దత్తు.

"నీ దగ్గిర లేకపోతే పోనీలే. రూపాయి పుట్టించాలంటే ఎంతకష్టంగా ఉందనుకున్నావు. ఏదో నాలుగురాళ్ళు తెచ్చుకుంటానికే అవస్థపడుతున్నావంటే మా సంగతి ఆలోచించు" అన్నాడు రంగడు.

దత్తు చాలా నొచ్చుకున్నాడు. తన జీతంలోనుంచి నెలకు అయిదు రూపాయలు పంపినా వీళ్ళు సుఖపడేవాళ్లు. తనకా ఆలోచన ఎందుకు తట్టలేదూ? 60 రూపాయలమీద తాను బతకలేదా?

ఈసారి దత్తు బొంబాయి వెళ్ళినప్పుడు తన ఖర్చు పూర్తిగా తగ్గించాడు. సినిమాలు చూడటం పూర్తిగా మానేశాడు. విక్టోరియా స్టేషను నుంచి ఆఫీసుకు ట్రామెక్కకుండా నడవసాగాడు. ఇందువల్ల అతను అయిదారు రూపాయలు మాత్రమే ఆదా చెయ్యగలిగాడు. ఈ అయిదారు రూపాయలకోసం తన జీవితంలోని అల్పసుఖాలన్నీ త్యాగం చేసినట్టనిపించింది దత్తుకు. కాని పళ్ళ బిగువున దీక్ష సాగించాడు. కాకపోతే తన భార్య లేదుకనక ఇంకో పదిహేను ఇరవై ఆదా అయింది.

దత్తు భార్య ప్రసవించింది, ఆడపిల్ల. తల్లినీ పిల్లనూ తీసుకురావటానికి దత్తే పోదామనుకున్నాడు. ఈలోపుగానే తల్లికి చాలా జబ్బుగా వుందని రంగడు వుత్తరం రాశాడు. ఈ వుత్తరం అందిన రెండోనాడే ఆమె పోయినట్టు టెలిగ్రాం వచ్చింది.

దత్తు బయలుదేరాడు. అతను మామగారింట భార్యనూ పిల్లనూ చూసుకుని స్వగ్రామం వెళ్ళేసరికి తండ్రి కూడా ప్రమాదావస్థలో వున్నాడు. తండ్రికి కాస్త నయమయ్యే దాకా వుండి బయల్దేరుదామనుకున్నాడు దత్తు.

"నాకేం తీపరంరా నాయనా? నేనింకా ఎన్ని అవస్థలు పడాలిసివుందో, నువు వెళ్ళు. నేను మళ్ళా లేచి తిరుగుతాలే" అన్నాడు తండ్రి.

దత్తు భార్యా బిడ్డలతో సహా బొంబాయి చేరుకున్న వారంరోజులకు తండ్రి మరణవార్త తెలిసింది.

దత్తుకు ఈసారి వచ్చినది దుఃఖం కాదు, ఆగ్రహం! ఎవరిమీదనో తెలియకుండా, పట్టరాని ఆగ్రహం! అతన్ని చూచి అతని భార్య ఆశ్చర్యంతో నిర్ఘాంతపోయింది.

"నన్నెందుకిట్లా పాపం వెంటాడుతున్నది? అయినవాళ్ళదగ్గిర కూర్చుంటే తిండిలేదు! తిండికోసం దేశాలు కాని దేశాలు పోవటమూ, పెళ్ళయినా, పురుడయినా, పుణ్యాలైనా దూరాన చావటమూనా! రంగడి పెళ్ళికి లేను! మా అమ్మ చావుకు లేను! నీ కానుపుకు లేను! మా నాన్న చావుకు లేను. ఎందుకీ ఉద్యోగమూ, సంపాదనానూ; తగలెయ్యనా? నేనిక్కడ పట్నవాసంలో సినిమాలు చూస్తూ కులుకుతుంటే అక్కడవాళ్ళు రూపాయికీ, అర్ధకూ ఉడ్డుకుడుచుకున్నారు. ఛీ, ఏం బతుకు?' అని దత్తు వాపోయాడు.

"బాగుందే? ఎవరి బతుకు వాళ్ళు బతకొద్దూ" అన్నది దత్తు భార్య.

"ఎవరి బతుకు వాళ్లు బతికినట్టయితే మా నాన్న ఆస్తికూడా నాకింద ఖర్చుకాదు.

వెధవ చదువు! మావాళ్ళు నాకోసం అడ్డమైన గడ్డీ తిన్నారు. వాళ్ళకు తెలీదు. పాపం ఈ వేదాంతం" అని దత్తు భార్య మీద పులిమాదిరిగా పడ్డాడు.

తండ్రి ఉత్తరక్రియలకు తను వెళ్ళటం అసంభవం. తన నెలజీతంలో నుంచి పది రూపాయలు మటుకు రంగడికి పంపాడు.

తండ్రిపోయిన మూడు వారాలకు చెప్పకుండా పెట్టకుండా రంగడు బొంబాయిలో ప్రత్యక్షమయినాడు. పొద్దున అయిదున్నరకు దిగినవాడు మాతుంగా చేరటానికి తొమ్మిదిన్నర అయింది. రంగడు వచ్చేసరికి దత్తు ఆఫీసుకు బయలుదేరే ప్రయత్నంలో ఉన్నాడు. రంగడికి ఇంగ్లీషూ రాదు. హిందూస్థానీ రాదు.

"నేనా దిక్కుమాలిన ఊళ్ళో ఉండలేను. మళ్ళీ ఒక ఎకరం అమ్మాను. బాకీలు తీర్చగా రెండువందలు మిగిలింది. మిగిలిన రెండెకరాలు తనపేర పెట్టమని నా పెళ్ళాం పట్టుపట్టింది. మామగారు దానికి మద్దత్తు. అప్పుచేసి దాన్ని పుట్టింట దిగవిడిచి బయలు దేరాను. ఇక్కడ ఏదన్నా చెయ్యలేకపోతానా" అన్నాడు రంగడు.

రంగడు తానుతెచ్చిన డబ్బు దత్తుదగ్గిరే ఉంచాడు. కావలసినప్పుడు రూపాయీ అర్ధా తీసుకుంటూ, రోజల్లా ఎక్కడెక్కడో తిరిగి రాత్రి దత్తుకన్న ఆలస్యంగా ఇల్లు చేరుకునేవాడు.

ఒకరోజు రంగడు ఢీలా అయిపోయినవాడల్లే కనిపిస్తూ ఇల్లు చేరుకున్నాడు - రంగడి ముఖాన చిరునవ్వు తాండవిస్తున్నది.

దత్తు రంగడికేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఉద్యోగం సంపాదించాను. లాల్బాగ్ దగ్గిర ఒక ఫ్యాక్టరీలో కూలిపని దొరికింది. రోజుకు మూడు పావలాలిస్తారు. ఇక చింతలేదు" అన్నాడు రంగడు.

దత్తు నిర్ఘాంతపోయినాడు.

"ఆ సంపాదనతో ఎట్లా బతుకుతావు? కాపరం ఎట్లా చేస్తావు?" అన్నాడు దత్తు.

"కాపరమేమిటి? నా పెళ్ళాన్ని నేను పోషించను. దానికి పొలమిచ్చేశాను. దానిదారి దానిదీ, నాదారి నాదీ? పని చాతయితే రూపాయో, రూపాయిన్నరో కూడా సంపాదించవచ్చు. ఇంకేం కావాలి?" అన్నాడు రంగడు నిశ్చింతగా.

మొదటి ముద్రణ: కథాసాగరం సంపుటి, డిసెంబర్ 1954
దేశి కవితా మండలి, విజయవాడ